



## అత్తగారి సాహిత్యం

మా అత్తగారొకావిడ ఉండేదిలెండి. వీధి బళ్ళో చిన్నప్పుడు చదువుకున్న ఆశాస్త్ర జ్ఞానం తప్పితే ఆవిడకు మరేదీ రాదు. కానీ అజ్ఞానంతోనే తానొక పండితురాలుగా చలామణి కావాలని కోరుకుంది. అప్పటినుండి తన వాగ్ధోరణినే పూర్తిగా మార్చివేసుకుంది. ఆమె ఎవరితోనైనా సంభాషించేటప్పుడంతా "ఏమిండీ! భోజనము నారగింతురా" "మనవారందరూ బాగుగా యున్నారా" "ఎప్పుడు వచ్చితిరి" అని వ్యాకరణ యుక్తంగా, సంధి నియమాలు తప్పకుండా సంభాషించేది. ఒక రోజున మా అత్తవారింటికి ఎవరో ముగ్గురు చుట్టాలొచ్చారు పట్నంలో ఏదో పనుందని కాబట్టి రాత్రికి భోజనానికి రామని తమ కోసం అనవసరంగా కాచుక్కూర్చోవద్దని చెప్పివెళ్ళారు. మరుసటి రోజు ఆ ముగ్గురూ తిరిగివచ్చారు. భోజనాలన్నీ అయినాయి. అందరం వసారాలో కూర్చుని పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నాం. ఇంతలో మా అత్తగారు తన భాషా నైపుణ్యాన్ని ఆ క్రొత్త చుట్టాలముందు ప్రదర్శించాలనుకుందేమోగాని ఉన్నట్టుండి "ఏమండీ నిన్న మా పేడ భుజించితిరండి'' అన్నది. తొకత్రొక్కిన త్రాచుల్లా లేచారు ఆ ముగ్గురూ. "ఏదో చుట్టపు చూపుగావస్తే మమ్మల్నింత అవమాన పరుస్తారా. ఇక నుండి మీగడప త్రొక్కితేఒట్టు" అంటూ రుసరుసలాడుతూ వెళ్ళిపోయారా ముగ్గురూ.

ఇంతకీ మా అత్తగారు చెప్పిందాంట్లో ఎటువంటి తప్పు (దురుద్దేశం) లేదు. "ఏమండి నిన్నటిరాత్రి మీరెక్కడ భోంచేశారు" అన్నదే ఆవిడ ప్రశ్న.

కాని సంధి నియమాలు తప్పకుండా వ్యాకరణ యుక్తంగా తన భాషా నైపుణ్యాన్ని ప్రదర్శించడంలో "నిన్నమాపు (రాత్రి) ఏడ (ఎక్కడ) భోంచేసితిరి' అనే వాక్యం సంధితో కలిసివచ్చుటచే "నిన్న మాపేడ భోంచేసితిరి" అనే విపరీతపు అర్థాన్నిచ్చింది. చూశారా మా అత్తగారి సాహిత్యం.

జి. చిరంజీవి

* * *

## "రమణయ్య"

మా మిత్రబృందంలో అమాయకుడైన మిత్రుడొకడు ఉండటంచేత పాపం వాడ్ని అందరూ ఏడిపించుక తినేవారు. వాడి నామధేయము రమణయ్య. వ్యవసాయం వాళ్ళ వృత్తి. వాడ్ని గురించే నేను చెప్పబోయేది మీరు వినబోయేదీను.

"ఒకసారి వీడు పనుండి పట్నం పోయేడు. అక్కడ వాళ్ళక్కకు జ్వరం రావటంచేత ఆమె వాడికొక అణాఇచ్చి "బాబూ! బజారులో ఆస్ప్రో" బిళ్ల ఒకటికొనితెచ్చియిద్దూ. మీ బావగారు కూడా యింట్లోలేరు. బాబ్బాబూ..." అని బ్రతిమాలుకోగా బజారుమొహం తెలియని రమణయ్య దాని అన్వేషణకయి బయలుదేరాడు. బయట బోర్డులలో వ్రాసివుండేదానినిబట్టి తేలిగ్గా కనుక్కోవచ్చునని వాడి ఉద్దేశం. అంత మహాపట్నంలో జనసమూహంలో త్రోసుకపోతున్నాడు. కొట్ల బోర్డుల మొహం చూడటంతో తన పల్లెటూరితనం బయటపడ్తుందని తన మొహాన్ని చాటుగా దించేసి క్రీగంటి చూపులతో బోర్డులను చూస్తూ పోతున్నాడు "దరిద్రుడి పెండ్లికి వడగండ్ల వాన". అన్నట్లు వర్షం కుండపోడగా కురియగా వీడికి వసారాలేని ఇల్లు ఒకటి దొరగ్గా అందులోకిదూరాడు. వాడు నుంచున్న చోటే "ఆస్ప్రో" వాడండి అనే బోర్డు కనిపించింది. వెదకబోయినతీగె కాలికే చుట్టుకొన్నట్లు సంతోషించాడు మన రమణయ్య. లోపల మందు సీసాలు, టేబులు మూడు కాళ్ళ కుర్చీ ఒకటి ఉన్నాయి. ఇంతలో నడివయస్సు వ్యక్తి ఒకడువచ్చి ఆదరించి బెంచీ మీద కూర్చోబెట్టాడు. వాడి కళ్ళ విషయమై ప్రశ్నలు అడుగుతు వాడి కండ్లను పరీక్షిస్తున్నాడు. "చచ్చాంరా బాబూ" వీడెవడో కండ్ల వైద్యుడు బిళ్ల లేక